

# ఫ్లాష్ బ్యాక్



**పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం**

## రాళ్ళబండి కుటుంబరావు
## (తెలుగు సినిమా 1949 మార్చి సంచికనుంచి)



**గుడివాడ తాలుకాలో** వున్న బల్లిపర్రు అనే గ్రామంలో రాళ్ళబండివారి కుటుంబం పెద్దదీ సంపన్నమైనదీ. ఈ గ్రామంలోనే యీ కుటుంబంలోనే జన్మించాడు మన కుటుంబరావు. ముగ్గురు కొడుకులలోనూ పెద్దవాడు. ప్రధమ సంతానమైన వాళ్ళు తల్లితండ్రుల గారాబాన్ని అమితంగా అనుభవిస్తారనేది అందరికీ తెలిసిన విషయమే. చిన్నతనంలో యితను పలికిన ప్రతిమాట తల్లితండ్రులకి ఒక వేదంగాను, యితను చేసిన ప్రతి పనీ ఒక మహోత్కృష్టమైన ఘనకార్యంగానూ కనబడిందంటే కుటుంబరావులో ప్రత్యేకత వుందని కాదు. కాని అతను ప్రధమ సంతానం కాబట్టి పిల్లల్ని అంత గారాబంగా పెంచితే వాళ్ళ లేత మనసుల్లో ఎటువంటిభావాలు చిగురిస్తాయో ఊహించుకోవటం కష్టం కాదు.

ఒక మనిషి జీవితం సుఖంగా జయప్రదంగా సాగిపోయిందన్నా, దారీ తెన్నూ లేకుండా పోయిందన్నదానికి కారణాలు చాలా వుంటాయి. కాని ముఖ్యంగా జీవితంలో ఓ మలుపో, మార్పో తీసుకురావటానికి ఒక ముఖ్య కారణం వుంటుంది.

రాళ్ళబండి కుటుంబరావూ 11 వ ఏట తండ్రిని పోగొట్టుకున్నాడు. చిన్నతనంలో తండ్రిని పోగొట్టుకోవటం ఎలా వుంటుందో, దానివెంట వచ్చే ఫలితాలు ఎలా వుంటాయో చాలామందికి తెలీదు.

మంచికి గాని చెడుకిగాని పిల్లల మీద తండ్రి ప్రభావం ఎంతో వుంటుంది. పిల్లాడి భావిజీవితానికి పునాది వెయ్యటానికీ, జీవితంపైన ప్రపంచంపైన స్పష్టమైన అభిప్రాయాలు ఏర్పడటానికి కూడా సామాన్యంగా తండ్రే బాధ్యత వహిస్తాడు.

తండ్రి లేకపోవటం దురదృష్టమంటాం. కాని చిన్నతనంలోనే తండ్రి స్థానాన్ని ఆక్రమించవలసి వొచ్చినపుడు – తమ్ముళ్ళనీ, తల్లినీ సంరక్షించవలసి వచ్చినపుడు దాన్నేమంటారు? దురదృష్టం అనేమాట చాలదు.

రాళ్ళబండి కుటుంబరావు సంసారానికి పెద్ద అయేటప్పటికి అతనికి పదకొండేళ్ళు. అతను తమ్ముళ్ళనీ, తల్లినీ సంరక్షించవలసి వచ్చిందంటే సంపాదించవలసి రావటంకాదు. ఒక లక్ష రూపాయలు విలువగల ఆస్తి ఆ చిన్నతనంలోనే అతని అజమాయిషీలోకి వచ్చింది. ఆ చిన్నకుర్రాడికి ఆ ఆస్తిని కాపాడే వీలుంటే పెంచే బాధ్యత కలిగేది.

మామిడి చెట్లు, చింతచెట్లు ఎక్కి గంతులు వేయవలసిన ఆ కుర్రతనంలో ట్రెజరీకి వెళ్ళి సిస్తులు కట్టటం బాధ్యత కాదూ!

చెడుగుడు ఆడవలసిన సాయంకాల సమయంలో ధాన్యం కొలిపించటం 11 ఏళ్ళ కుర్రాడికి బాధ్యతకాదూ!

తన యీడు కుర్రాళ్ళతో గంతులేయవలసిన ఆ చిన్నతనంలో కరణంతో మాట్లాడుతూ కూర్చోటం అహేతుకరమైన సహవాసం కదూ!

ఈ విడ్డూరాలన్నీ కుటుంబరావు జీవితంలో మరేవో విడ్డూరాలని కలిగించకుండా వుంటాయా?

ఖర్చు పెట్టేందుకు కావలసినంత డబ్బు తన చేతిలో, తిరిగేందుకు కావలసినంత మంది స్నేహితులు; వినోదానికి కావలసినన్ని అవకాశాలు. వయస్సు 11. చదువుకుంటాడా? స్కూలుకి వెళతాడా?

కుటుంబరావు మూడోఫారంతో చదువు మానేశాడు. పధ్నాలుగో ఏట యితనికి వివాహం అయింది.

ఒక మూడు దశాబ్దాలవరకూ ఎంత తిన్నా తరగని ఆస్తి ఓ మూలవుంది. ఇక భుక్తికోసం కాయకష్టం చేయవలసిన అవసరం ఏముంది?

సాహిత్య గోష్టులలో, సాహితీపరుల సంపర్కంలో గడిచిపోయింది అతని జీవితం. కొన్నేళ్ళు ఒక మూల ఆస్తి తరిగిపోతూంది. కాని కుటుంబరావుకి ఆ చింత ఏది?

అతనికి నాటకాలలోనూ ఉత్సాహం వుండేది. ఆ ప్రాంతంలో ఎక్కడ ఏ నాటకం ప్రదర్శితమైనా అతను హాజరు. రంగస్థల నటీనటులు అతనికి సన్నిహితులు. అతని ఉత్సాహం నటించటం మీదకన్నా నాటకాలని విమర్శించటంలో

ఎక్కువ. పామర్రులో జరిగిన ఒక సప్తాహంలో రామదాసు నాటకంలో అనుకోకుండా తానీషా వేషం వేశాడు. రాఘవాచారి, సూర్యనారాయణగారితో కూడా నటించాడు.

సంవత్సరాలు తృటిలో తిరిగిపోతున్నాయి.

కొండంత ఆస్తి కరిగిపోయింది.

అప్పులకి జడిసేవాడు కాదు కుటుంబరావు. తీర్చటానికి కష్టపడేవాడు కాదు.

జరిగిపోతోంది కాలం.

ఉద్యోగమా? సంపాదనా? ఆలోచనల్లోకి వచ్చాడు మొట్టమొదటిసారి నలభై ఏళ్ళకి.

మ్యూజిక్ డైరెక్టర్ బి.యన్.ఆర్ కుటుంబరావుకి మంచి స్నేహితుడు. బి.యన్.ఆర్, తీస్తున్న 'మీరాబాయి'లో భానుసింహుడు వేషం వేయటానికి మద్రాసుకి వచ్చాడు కుటుంబరావు బి,యన్,ఆర్ ఆహ్వాన ఫలితంగా. రామానుజాచారి ధర్మపత్నిలో నటించటానికి వీలుకాక పోవటం కుటుంబరావుకి రెండో అవకాశం యిచ్చింది. ఆ తర్వాత కీర్తిశేషులు రామబ్రహ్మంగారి పత్నిలో నటించాడు.

ఈ సమయంలోనే కుటుంబరావుకి సినిమా నటన అంటే అదివొక జీవనోపాధిగా స్వీకరించాలంటే అసహ్యం కలిగింది.

"ఇది మనబోటివాళ్ళకి కాదురా బ్రదర్" అనటం ప్రారంభించాడు. పత్ని అయిన తర్వాత బెజవాడకి వెళ్ళి క్లబ్బు జీవితంలో సుఖాన్ని మరిగాడు. అది ఆయనెన్నడూ బాధించలేదు. డబ్బు నిమిషాల మీద పుట్టించే కిటుకులు తెలుసు ఆయనకి.

ద్రోహిలో వేషం వేయమని ప్రకాశరావు ఈయన్ని అడిగినపుడు "మళ్ళీ ఎందుకులే బ్రదర్" అన్నాట్ట విసుగ్గా.

'ద్రోహి ' కోసం మద్రాసు వస్తే ధర్మాంగదలోకి రమ్మన్నారు. అయిష్టంతోనే ఒప్పుకున్నాడు. ధర్మాంగదలో ఈయన పార్టు దాదాపు పూర్తి అయింది.

Post your comments